## గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.30లక్షలు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 9: హుస్నాబాద్ పట్టణంలోని నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.30లక్షల రూపాయలు మంజూరయ్యాయి. స్థానిక మండల పరిషత్ ఆవరణలో నూతన భవన నిర్మాణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. పాత భవనం శిథిలావస్థకు చేరడంతో ఈ కార్యాలయాన్ని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. ఈ భవనానికి దాదాపు రూ.80లక్షల వ్యయం అవుతుండగా ఇప్పటివరకు రూ.50లక్షలు మంజూరయ్యాయి. తాజాగా మంజూరైన నిధులతో ఫర్నిచర్, మూత్రశాలలు, ప్రహరీ నిర్మాణం, గేట్, బోరు, మోటర్ తదితర పనులు చేపట్టనున్నారు. ఈ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు కృషిచేసిన బీసీసంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

## అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 9: రిలయన్స్ ఫౌండేషన్, సీఆర్‌వై ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మద్దూరు సెక్టార్‌లోని అంగన్‌వాడీ టీచర్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత మాట్లాడుతూ కరికులం ఆధారంగా నెల అంశానికి టీఎల్ఎం ఆధారంగా పిల్లలకు బోధించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్, సీఆర్‌వై ఆర్గనైజేషన్ బ్లాక్ ఆర్డినేటర్ సరిత, సీఆర్పీ మౌనిక, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు

## అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొమురవెల్లి, జూన్ 9: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ఈ సంవత్సరం అప్‌గ్రేడ్ కావడంతో ఇంటర్ తరగతులు ప్రారంభిస్తున్నామని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పి.నీరజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులను ఆంగ్ల మాధ్యమంలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తెలుగు, ఆంగ్లం, ఎకనామిక్స్, క్రామర్స్, సివిక్స్ ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు అర్హత గల మహిళా అధ్యాపకులు ఈ నెల 12వ తేదీలోగా అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంఏ, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. నర్సింగ్ బోధించేందుకు నర్సింగ్ పూర్తి చేసినవారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9505754157 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి



రాజేశం మృతదేహం

దుబ్బాక,జూన్ 9: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బల్వంతాపూర్‌లో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రెడ్డబోయిన రాజేశం(42) తనకు ఉన్న ఐదు ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ అందులో కోళ్లఫారం నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి కోళ్లఫారంలోకి కోడి పిల్లలు వస్తాయని ఇంట్లో చెప్పి రాజేశం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లా డు. పౌల్ట్రీ పక్కన ఉన్న కరెంట్ తీగకు ప్రమాదవశాత్తు రాజేశం చేయి తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం వేకువజామున అటుగా వెళ్తున్న రైతులకు గడ్డి పొద ల్లో రాజేశం మృతదేహాన్ని చూసి అతడి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య మనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై గంగరాజు తెలిపారు.

## కారు బైక్ ఢీ

- ఇద్దరికి తీవ్రగాయాలు
- దవాఖానకు తరలింపు



కోహెడ, జూన్ 9: మండలంలోని గాగిళ్లాపూర్ గ్రామానికి చెందిన కారు అక్కన్నపేట మండలం రేగొండ గ్రామానికి చెందిన బైక్ కోహెడ మండలం శ్రీరాములపల్లి గ్రామశివారులో కెనాల్ దారి వద్ద సోమవారం సాయంత్రం ఢీ కొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## మందుబాబులకు జరిమాన

గజ్వేల్, జూన్ 9: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 31మందికి సోమవారం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి స్వాతిగౌడ్ రూ.31వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించి కోర్టులో హాజరుపర్చగా జరిమానాలు విధించినట్లు తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రతి రోజూ బ్రీత్ ఎనలైజర్ ద్వారా వాహనాల తనిఖీ చేపడుతున్నామని, మద్యం తాగి వాహనాలు నడుపరాదని సూచించారు.

# భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



గజ్వేల్ మండలం రిమ్మనగూడలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రవణ్‌కుమార్

**మద్దూరు తహసీల్దార్ మహ్మద్ అబ్దుల్ గఫూర్ రహీం**



వల్లంపట్లలో మాట్లాడుతున్న తహసీల్దార్ రహీం

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 9: భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు దోహదపడుతాయని మద్దూరు తహసీల్దార్ మహ్మద్ అబ్దుల్ గఫూర్ రహీం అన్నారు. మద్దూరు మండలంలోని వల్లంపట్లలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలతో పాటు సాదాబైనామాలు, పీవోటీ కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలోని 60మంది నుంచి వివిధ రకాల దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు రమేశ్, అన్వర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**ఫిర్యాదులను పరిష్కరిస్తాం**

గజ్వేల్, జూన్ 9: భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఇచ్చిన ఫిర్యాదులను త్వరలోనే పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రవణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని రిమ్మనగూడ, బంగ్లావెంకటాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల్లో రైతులు భూసమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులుగా కొనసాగుతున్న సదస్సుల్లో ఆయా గ్రామాల్లో వివిధ సమస్యలను రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భార్గవ్‌సాగర్, భాస్కర్, ఆర్ఐలు కృష్ణ, సంతోష్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

**రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలి**

చేర్యాల, జూన్ 9 : పట్టణంలోని రైతు వేదికలో ఈ నెల 11వ తేదీన రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చేర్యాల పట్టణ రెవెన్యూ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ దిలీప్‌నాయక్ కోరారు.సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు భూ సంబంధమైన సమస్యలుంటే సదస్సులో అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు.

# ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

- టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రం
- గజ్వేల్ మండలం కొల్గూర్‌లో బడిబాట



గజ్వేల్ మండలం కొల్గూర్‌లో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రం

గజ్వేల్, జూన్ 9: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రామచంద్రం అన్నారు. ప్రభుత్వ బడుల్లో పిల్లల నమోదు శాతాన్ని పెంచడానికి తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకొచ్చేలా టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట ప్రచార కళాజాతలో భాగంగా కొల్గూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొద్ది రోజులుగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ కార్యాక్రమం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల్లో మార్పు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్, జోన్ కన్వీనర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజులు, ఎల్లయ్య, సత్తయ్య, పాపిరెడ్డి, శంకర్, నర్సింహులు, విద్యాసాగర్, నాగరాజు, రాజయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

**ఐనాపూర్‌లో**

కొమురవెల్లి, జూన్ 9: బడీడు పిల్లలను పాఠశాలకు పంపాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఐనాపూర్‌లో జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాల గొప్పతనం గురించి వివరించి బడీడు పిల్లలను బడికి పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారుడు పిన్నింటి రత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఐనాపూర్‌లో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు



అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

**దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో..**

దుబ్బాక,జూన్ 9: సర్కారు బడుల్లోనే విద్యార్థులకు గుణాత్మక విద్య అందుతుందని దుబ్బాక ఎంఈవో ప్రభుదాస్ అన్నారు. సోమవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట, అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి గ్రామాల్లో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు ఇంటింటా సర్వే చేసి బడీడు పిల్లలను గుర్తించారు. ప్రైవేట్ బడుల కంటే సర్కారు బడుల్లోనే గుణాత్మక విద్యతో పాటు ఉచితంగా భోజనం, దుస్తులు, పాఠ్యపుస్తకాలతో పాటు మౌలిక వసతులు ఉంటాయని పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. బాలిక విద్యపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్పీ తాళ్ల నవీన్‌కుమార్, పాఠశాలల ఉపాధ్యాయులు, శ్రీనివాస్, జ్యోతిప్రియ,రవి, సుధాకర్ పాల్గొన్నారు.

## నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



గదుల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఈవో అన్నపూర్ణ

**ఆలయ ఈవో అన్నపూర్ణ**

చేర్యాల, జూన్ 9: కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవస్థానంలో చేపట్టిన గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆలయ ఈవో అన్నపూర్ణ సూచించారు. సోమవారం ఆలయానికి సంబంధించిన 50 గదుల నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గదుల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆమె వెంట నాయకుడు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మాగంటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## మాగంటి మృతి బీఆర్‌ఎస్‌కు తీరనిలోటు

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

చేర్యాల, జూన్ 9: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరనిలోటని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని మాగంటి నివాసానికి ఎమ్మెల్యే పల్లా చేరుకొని గోపీనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచి నియోజకవర్గ ప్రజలకు విశేషంగా సేవలందించినట్లు గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా మాగంటి గోపీనాథ్ చేసిన సేవలు మరువలేనివన్నారు.

## మద్దూరు చిన్నవాగుపై దెబ్బతిన్న బ్రిడ్జి



మద్దూరులో దెబ్బతిన్న చిన్నవాగు బ్రిడ్జి

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 9: మద్దూరు మండల కేంద్రంలోని చిన్నవాగుపై కొన్నేండ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. మద్దూరు-ముస్త్యాల గ్రామాల మధ్యలో ఉన్న ఈ బ్రిడ్జిపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. బ్రిడ్జిపై భారీ వాహనాలు వెళ్లడంతో బ్రిడ్జిదెబ్బతిని దానిపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో బ్రిడ్జిపై ప్రయాణం చేసేందుకు వాహనచోదకులు జంకుతున్నారు. వర్షాకాలమైతే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.రాత్రి సమయంలో సదరు బ్రిడ్జిపై ప్రయా ణం చేసే వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుంటున్నారు. గతంలో ఓ యువకుడు గుంతల్లో పడి మరణించిన సందర్భం కూడా ఉంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి, మద్దూరు చిన్నవాగుపై దెబ్బతిన్న బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని పలువురు గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

# రాజీయే రాజమార్గం

- కేసుల పరిష్కారానికి చక్కని వేదిక లోక్‌అదాలత్
- కక్షిదారులు వినియోగించుకొని ఉపశమనం పొందాలి
- మీడియా సమావేశంలో జడ్జి జయప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి జయప్రసాద్

సిద్దిపేట టౌన్, జూన్ 9 :రాజీయే రాజమార్గం.. కేసుల పరిష్కారానికి చక్కని వేదిక లోక్ అదాలత్ అని జిల్లా సెషన్ జడ్జి జయప్రసాద్ అన్నారు. న్యాయసేవాధిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని కోర్టు సమావేశం మందిరంలో సోమవారం ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ. జిల్లాలో 14వేల 464 పెండింగ్ కేసులు ఉన్నాయని, రాజీమార్గం ద్వారా పరిష్కరించదగినవి 2,441 కేసులను గుర్తించామన్నారు. ఇంకా కోర్టుకు, పోలీస్ స్టేషన్ వరకు రాని కేసులు ఏమైనా ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. కేసుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కక్షిదారులు జిల్లా కోర్టు ఆవరణలో 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకొని ఉపశమనం పొందాలన్నారు. సమావేశంలో జడ్జి మిలింద్ కాంబ్లే, న్యాయవాదులు, న్యాయసేవాధికార సంస్థ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులకు చెప్పొద్దు

చేర్యాల, జూన్ 9: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొముర వెల్లి ఎస్సై రాజు సూచించారు. సోమవారం మండలంలోని నాగపురి గ్రామ శివారుపల్లె గండికుంటలో సీపీ అనురాధ ఆదేశాల మేరకు ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులకు చెప్పవద్దన్నారు. సైబర్ నేరాలు జరిగినట్లు గుర్తించిన వెంటనే 1930కు కాల్ చేయాలన్నారు. బైక్ నడిపే సమయంలో వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. అంతకుముందు మహిళల రక్షణ, సైబర్ నేరాలు, డ్రగ్స్ నిర్మూలన, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీటీమ్ సభ్యులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.




ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజు

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా మహిళలు

గజ్వేల్, జూన్ 9: గజ్వేల్ మెప్మాలో జరిగిన అవినీతిపై త్వరగా విచారణ పూర్తి చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధితులకు న్యాయం చేసేలా రుణాలు రికవరీ చేయించాలని కోరుతూ సోమవారం ప్రజావాణితో అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్‌కు సీపీఐ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు ఫిర్యాదు చేశారు. రుణాల మంజూరులో జరిగిన అవినీతిపై చేపడుతున్న విచారణ త్వరగా పూర్తి చేయాలని, మహిళా సంఘాలకు చెందిన డ్వాక్రా మహిళలను మోసం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని రుణాలను రికవరీ చేయించి న్యాయం చేయాలని కోరారు.

## కారుణ్య నియామకం ఉద్యోగ ం ఆర్డర్ అందజేత



నియామకపత్రం అందజేస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేట, జూన్ 9 : కారుణ్య నియామకాల్లో భాగంగా సంవత్సరం క్రితం అనారోగ్యంతో చనిపోయిన హెడ్ కానిస్టేబుల్ యాదగిరి కుమారుడైన వినోద్‌కు సోమవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అనురాధ జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు విడతల వారీగా కారుణ్య నియామకాల్లో ఉద్యోగాలు వస్తాయన్నారు. నీతి, నిజాయితీగా ఉద్యోగాలు చేస్తూ డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో యాదమ్మ, సూపరింటెండెంట్ ఫయాజుద్దీన్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

సిద్దిపేట, జూన్ 9 : ప్రభుత్వం వెంటనే మావోయిస్టులతో చర్చలు జరిపి ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో సీపీఐ రెండో మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల భవిష్యత్ అంధకారంలోకి నెట్టి వేయబడిందని, రోజు రోజుకూ దేశంలో పేదరికం పెరిగిపోతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల నాయకులు పాల్గొన్నారు.

## పట్టణ పరిశుభ్రతకు సహకరించాలి



అధికారులతో మాట్లాడుతున్న మేనేజర్ సంపత్‌రావు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 9: పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ ఇన్‌చార్జి మేనేజర్ పి. సంపత్‌రావు కోరారు. హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం తడి, పొడిచెత్తపై వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడిచెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాల సిబ్బందికి ఇవ్వాలని సూచించారు. తడిచెత్తను ఎరువుగా మార్చుకునేందుకు కృషిచేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తే డంపింగ్ యార్డులకు చెత్తరావడం తగ్గుతుందన్నారు. రోజూ హుస్నాబాద్ పట్టణంలో 5.5టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుందని, ఇందులో తడిచెత్త 1.82టన్నులు, పొడిచెత్త 0.533టన్నులు వస్తుందని, దీంట్లో 58శాతం చెత్తడంపింగ్‌యార్డుకు వెళ్తుందన్నారు. ఇంట్లోనే ఎరువు తయారుచేసుకుని చెత్తను తగ్గించే విధంగా అన్ని విభాగాల అధికారులు ప్రజల్లో చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలఎల్లం, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, బేసిల్ ఫౌండేషన్ సభ్యులు నవీన్, సాయి పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడుపొద్దు



మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ మురళి

గజ్వేల్, జూన్ 9: మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ట్రాఫిక్ సీఐ మురళి సూచించారు. సోమవారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించిన సమయంలో 40మంది పట్టుబడ్డారని వారికి కౌన్సిలింగ్ సెంటర్‌లో కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. మద్యం తాగిన సమయంలో ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడుపరాదని, ప్రతి వాహనదారుడు లైసెన్స్, ఆర్‌సీ, బీమా కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై జగదీశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

## కొమురవెల్లిలో సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్‌గౌడ్

కొమురవెల్లి, జూన్ 9 : నాలుగో విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్‌గౌడ్, ఏపీడీ శివాజీ ఆయా గ్రామాల వారిగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 2024-25లో జరిగిన ఉపాధిహామీ పనుల రికార్డుల్లో మాస్టర్ కొలతలు కొట్టివేయడంతో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.8వేల ఫైన్ వేశారు. పంచాయతీరాజ్ విభాగంలో చేసిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన రికార్డులు సమర్పించకపోవడంతో ఏఈ శివకుమార్ రూ.5వేలు ఫైన్ విధించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఏటా సామాజిక తనిఖీ చేపట్టినప్పటికీ ఉపాధిహామీ పనుల రికార్డుల్లో తప్పులు, కొట్టివేతలు జరుగుతున్నాయన్నారు.కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసవర్మ, జూన్‌యర్ క్వాలిటీ కాంట్రోల్ ఆఫీసర్ సంతోష్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ గోవిందు కాశన్న, సీసీ బాలలింగం, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## మోకాలో ఉన్న రైతులకు పట్టాలివ్వాలి



మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామిగౌడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి ప్రతం అందజేస్తున్న రైతులు

కొమురవెల్లి, జూన్ 9 : మండలంలోని రసూలాబాద్‌లో సర్వే నెంబర్ 257లోని భూదాన్ భూమిలో మోకాలో ఉన్న రైతులకు పట్టాలివ్వాలని మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామిగౌడ్ కోరారు. సోమవారం గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే నెంబర్ 257లోని భూదాన్ భూమిలో మోకాలో ఉన్న రైతులకు పట్టాలివ్వాలని తహసీల్దార్ దివ్యకు వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.